# అవినీతికి కేరాఫ్‌గా ట్రెజరీ కార్యాలయాలు




- అడిగింది ఇస్తేనే ఆన్‌లైన్ చేస్తామంటూ బెదిరింపులు
- ఉద్యోగ విరమణ పొందిన వారినుంచి భారీగా వసూళ్లు
- సిరిసిల్ల డీటీవో, వేములవాడ ఎస్టీవో కార్యాలయాల్లో పెచ్చుమీరిన అవినీతి
- ఒక్కో ఫైల్ ఆన్‌లైన్ చేసేందుకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు వసూలు
- ఈ రెండు కార్యాలయాల పరిధిలో ఏసీబీకి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- అదే బాటలో మరికొన్ని ట్రెజరీ ఆఫీసులు
- లబోదిబోమంటున్న రిటైర్డ్ ఉద్యోగులు
- అక్రమార్కులకే వంత పాడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు

**ఉమ్మడి జిల్లాలో పలు జిల్లా ట్రెజరీ, సబ్‌ట్రెజరీ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. ఇప్పటికే పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ శాఖ.. తాజాగా, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయ, ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్ చేయడానికి వసూలు చేస్తున్న తీరు వారి అవినీతి దాహార్తికి నిదర్శనంగా నిలుస్తోంది. పలు చోట్ల అధికారులు నిజాయితీగా పనిచేస్తుండగా.. సిరిసిల్ల డీటీవో, వేములవాడ ఎస్టీవో కార్యాలయాల్లో మాత్రం ఒక్కో ఫైల్ వివరాలు అప్‌లోడ్ చేసేందుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అడిగిన మామూళ్లు ఇచ్చే వరకు ఫైలు ముట్టుకునే ప్రశ్నేలేదని నిర్మొహమాటంగా చెబుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే బాటలో మరికొన్ని ఎస్టీవో కార్యాలయాలు నడుస్తుండగా.. ఉద్యోగ విరమణ పొందిన తమకు గౌరవం ఇవ్వాల్సిన సదరు అధికారులే లంచాల కోసం వేధిస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

**కరీంనగర్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) :** స్వరాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గత కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 ఏళ్లకు పెంచింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలు 30 మార్చి 2021 నుంచి అమలులోకి వచ్చాయి. కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు సర్వీసు కలిసి వచ్చింది. దీంతో గడిచిన మూడేళ్లుగా దాదాపు రిటైర్‌మెంట్లు ఆగిపోయాయి. తిరిగి ఈ ఏడాది మార్చి 30 నుంచి రిటైర్‌మెంట్లు ప్రారంభమయ్యాయి. ఆ మేరకు ప్రతి నెలా వందల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు రిటైర్‌మెంట్ అవుతున్నారు. మున్ముందు ఈ సంఖ్య పెరగనున్నది. నిజానికి ఉద్యోగ విరమణకు సంబంధించి ఉపాధ్యాయులకైతే జిల్లా విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులకైతే ఆర్‌జేడీ ముందుగా లేఖలు పంపిస్తారు. అలాగే.. వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా ఉద్యోగ విరమణ తేదీలను వివరిస్తూ లేఖలు అందుతాయి. సదరు లేఖల పరిగణలోకి తీసుకొని ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి స్వరీసు బుక్ ఆధారంగా ఎవరికి వారే తమ తమ పూర్తి వివరాలతో ఒక ఫైల్ తయారు చేసుకుంటారు. సంబంధిత అధికారుల ఆమోదం తీసుకుంటారు. ఆ తర్వాత సదరు ఫైలును నేరుగా వెళ్లి సదరు ఉద్యోగులే హైదరాబాద్‌లోని అకౌంటెంట్స్ జనరల్ (ఏజీ) కార్యాలయంలో సమర్పిస్తారు. ఏజీ అధికారులు.. సంబంధిత ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగి వివరాలు పరిశీలించిన తర్వాత.. గ్రాట్యుటీ, కమిటేషన్ పేరుతో రెండు పేపర్లతో కూడిన మూడు సెట్లను పంపిస్తారు. ఇందులో ఒక సెట్టును ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగికి, మరొకటి సంబంధిత కార్యాలయం, ఇంకో సెట్‌ను సంబంధిత జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపిస్తారు. ఏజీ కార్యాలయం నుంచి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి వచ్చిన వివరాలను డీటీవో అక్కడి నుంచి సంబంధిత ఉద్యోగ విమరణ పొందిన ఉద్యోగి పరిధిలోని సబ్ ట్రెజరీ కార్యాలయాలకు పంపిస్తారు.

## నిలబెట్టి వసూళ్లు..?

ఒక ఉద్యోగి కావచ్చు.. ఉపాధ్యాయుడు కావచ్చు.. దశాబ్దాల కాలం పాటు ఆయా రంగాల్లో సేవలందించి రిటైర్ అవుతున్న విషయం తెలిసిందే. వారు అప్పటికే అచేతన స్థితికి చేరుకుంటారు కాబట్టి.. వారికి రావాల్సిన పెన్షన్, ఇతర భత్యాల కోసం.. ఆయా శాఖల ఉద్యోగులు స్వచ్ఛందంగా సహకారం అదించాలి. కానీ. ఈ స్పృహ ట్రెజరీ కార్యాలయాల్లో కొరవడిందన్న విమర్శలు వస్తున్నాయి. అయితే, ఇందులోనూ కొన్ని జిల్లా ట్రెజరీ, సబ్‌ట్రెజరీ కార్యాలయాలు నిజాయితీగానే పనిచేస్తున్నాయి. కానీ, మెజార్టీ కార్యాలయాలు మాత్రం అవినీతికి కేరాఫ్‌గా మారుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ట్రెజరీ, సబ్‌ట్రెజరీ, వేములవాడలోని సబ్ ట్రెజరీ కార్యాలయాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి ఏజీ నుంచి ట్రెజరీ కార్యాలయాలకు వచ్చిన పత్రాల ప్రకారం సంబంధిత ఉద్యోగ విమరణ పొందిన ఉద్యోగికి అన్ని రకాలుగా అండగా నిలిచి.. సదరు వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత ట్రెజరీ కార్యాలయాల నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. మొత్తం వివరాలను పూర్తిగా పరిశీలించి అప్‌లోడ్ చేసిన తర్వాత మాత్రమే సంబంధిత రిటైర్డు ఉద్యోగులకు పింఛన్ ప్రారంభమవుతుంది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుంటున్న ట్రెజరీ అధికారులు.. వివరాలను ఆన్‌లైన్ చేయడానికి ముడుపులు దండిగా వసూలు చేస్తున్నారు. వీటిపై ప్రశ్నిస్తే ఎక్కడ తిరకాసు పెడుతారో అన్న భయంతో వారు అడిగిన మొత్తం ఇవ్వడానికి తప్పని పరిస్థితుల్లో ఒప్పుకొంటున్నారు. ఈ తరహా వ్యవహారం సిరిసిల్ల, వేములవాడలో భారీ మొత్తంలో నడుస్తోంది. ప్రధానంగా ఒక్కో ఫైల్ అప్‌లోడ్ చేయడానికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని రిటైర్డు ఉద్యోగులు చెబుతున్నారు. అంతే కాదు.. ఇవ్వని వారి ఫైళ్లు ముట్టుకోవడం లేదని అంటున్నారు. అడిగిన మొత్తం ఇచ్చినట్లుగా నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే ఫైళ్లు కదులుతున్నాయని చాలా మంది 'నమస్తే తెలంగాణ' దృష్టికి తెచ్చారు. అంతే కాదు.. ఈ విషయంపై ఏసీబీ కార్యాలయాలకు కూడా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాము రిటైర్‌మెంట్ అయి అచేతన స్థితిలోఉంటే తమ నుంచి లంచాలు.. అది కూడా డిమాండ్ చేసి వసూలు చేయడం ఏమిటన్న వేదనను వ్యక్తం చేస్తున్నారు.

## అక్రమార్కులకే సంఘాల వత్తాసు

సిరిసిల్ల, వేములవాడ ట్రెజరీ కార్యాలయాల పరిధిలో జరుగుతున్న అవినీతి వ్యవహారాన్ని ముగ్గురు ఉపాధ్యాయులు, ఇద్దరు రిటైర్డు ఉద్యోగులు ఆయా సంఘాల దృష్టికి తీసుకెళ్లినట్లుగా సమాచారం. తమకు అండగా నిలువాలని, అవసరమైతే తమతో పాటు వచ్చి.. మామూళ్లు అడుగుతున్న అధికారులతో మాట్లాడాలని విజ్ఞప్తి చేసినట్లుగా తెలుస్తోంది. నిజానికి ఈ విషయంలో తక్షణం స్పందించాల్సిన సదరు సంఘాలు మాత్రం.. రేపు, మాపు అంటూ తప్పించుక తిరుగుతున్నట్లుగా సదరు రిటైర్డు ఉద్యోగులు తెలిపారు. మొత్తంగా సంఘాల దాటవేత ధోరణి చూస్తే.. అక్రమార్కులకు పూర్తిగా వత్తాసు పలుకుతున్నట్లుగా తమకు అర్థమవుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో.. ఈ అవినీతికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన మార్చి నుంచి ఇప్పటి వరకు రిటైర్డు అయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు, అందులోనూ ట్రెజరీ కార్యాలయాల్లో వివరాలు అప్‌లోడ్ అయిన వారితో కలిసి మాట్లాడితే... వసూళ్ల పర్వం మొత్తం బహిర్గతమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు నిజంగా విచారణ చేస్తే.. తాము ఎవరికి ముడుపులు ఇచ్చామో చెపుతామని పలువురు రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అంతే కాదు.. ఇక నుంచి నెలానెలా ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగల సంఖ్య పెరగనుంది. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ఉన్నతాధికారులు ఈ అడ్డగోలు వసూళ్లకు అడ్డువేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా పదవి విమరణ పొందే ఉద్యోగులకు కొంత మేరకైనా లాభం చేకూరుతుంది.

# 'కూష్మాండ' అలంకారంలో లోకమాత



కూష్మాండ అలంకారంలో అమ్మవారు

వేములవాడ టౌన్, అక్టోబర్ 6 : శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయంలో కొలువుదీరిన శ్రీ రాజరాజేశ్వరీదేవి అమ్మవారు ఆదివారం నాలుగో రోజు కూష్మాండ అలంకారంతో పూజలందుకుని భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మా.. చంద్రఘంట, దుర్గామాత నమోస్తుతే అంటూ ప్రణమిల్లారు. కూష్మాండ అలంకారంతో ఉన్న అమ్మవారు రాత్రి నంది గరత్మంతుని వాహనంపై పురవీధులగుండా భక్తులకు దర్శనమిచ్చారు.

# గ్రానైట్ పరిశ్రమకు తిప్పలు

## కుదేలవుతున్న నిర్మాణ రంగం

**గ్రానైట్ ఇండస్ట్రీకి పెట్టింది పేరుగా ఉన్న కరీంనగర్ ప్రస్తుతం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. పలు కారణాల వల్ల నిర్మాణ రంగం తగ్గుతున్న నేపథ్యంలో.. ఇప్పటికే కంకర ఇటుక, సిమెంట్ కంపెనీలు తమ తమ ప్రొడక్షన్ నుంచి 20 నుంచి 30 శాతం తగ్గించుకోగా.. ఇప్పుడు ఆ ప్రభావం గ్రానైట్ పరిశ్రమను తాకింది. ప్రధానంగా కటింగ్ అండ్ పాలిషింగ్ ప్యాక్టరీల పరిస్థితి ముందుకెళ్తే నుయ్యి.. వెనక్కి వెళితే గొయ్యి అన్న చందగా తయారైంది. ఈనేపథ్యంలోనే.. తమ ఉత్పత్తిని తగ్గించుకోవాలని నిర్ణయించిన కంపెనీలు.. ప్రతి ఆదివారం ప్రొడక్షన్ హాలిడే డిక్లేర్ చేయడంతో పాటు ఆదివారం నుంచే అమలు చేయడం ప్రారంభించాయి. దాదాపు రెండు, మూడు దశాబ్దాల చరిత్రలో.. ఈ తరహా పరిస్థితి కటింగ్ పరిశ్రమలకు రావడం ఇదే ప్రథమమని తెలుస్తోంది.**

**- కరీంనగర్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

- భారీగా తగ్గిన గ్రానైట్ సేల్స్
- ప్రతి ఆదివారం ప్రొడక్షన్ హాలిడే ప్రకటించిన కటింగ్ మిషన్స్ యజమానులు
- గ్రానైట్ చరిత్రలోనే తొలిసారి ఈ పరిస్థితి
- తప్పని పరిస్థితుల్లో ప్రొడక్షన్ హాల్‌డే నిర్ణయం తీసుకున్నాం: అధ్యక్షుడు జువ్వాడి ప్రణీత్‌రావు




ఆదివారం నిలిచిపోయిన గ్రానైట్ కటింగ్ మిషన్

## ప్రతి ఆదివారం ప్రొడక్షన్ హాలిడే



కొన్ని నెలలుగా నిర్మాణ రంగం కుదేలు అవుతున్న నేపథ్యంలో అ ప్రభావం ఒక్కో ఇండస్ట్రిని తాకుతోంది. ఆయా కంపెనీలు చేస్తున్న ఉత్పత్తికి అనుగుణంగా మార్కెట్‌లో విక్రయాలు లేకపోవడం.. భారీ స్టాక్‌ను మోసే సామర్థ్యం కంపెనీలకు లేకపోవడం. వంటి పరిస్థితుల నేపథ్యంలో... ఒక్కో రంగం తన ప్రొడక్షన్ తగ్గించుకునే బాటలోనే పయనిస్తున్నాయి. ఇందులో భాగంగానే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ కంపెనీలు ఇప్పటికే తన ప్రొడక్షన్‌లో 20 నుంచి 30 శాతం తగ్గించుకున్నాయి. అంతేకాదు ఇదే పరిస్థితి ఉంటే.. ముందు ముందు మరింత ప్రొడక్షన్ తగ్గించాల్సిందే అంటూ సిమెంట్ కంపెనీ యజమానులు చెపుతున్నారు. ఈ ప్రభావం అన్ని ప్యాక్టరీలపై పడుతోంది. సిమెంట్‌తో పాటుగా ఇటుక, కంకర ఉత్పత్తిచేసే ప్యాక్టరీలు ఇప్పటికే తమ ప్రొడక్షన్‌లో ఇరవైనుంచి ముప్పై శాతం ప్రొడక్షన్ తగ్గించాయి. ప్రస్తుతం ఈ ప్రభావం ఉమ్మడి జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమను తాకింది. నిజానికి కరీంనగర్ జిల్లాలోని బావుపేట, కాజీపూర్, కమాన్‌పూర్. ఓద్యారం, అచంపల్లి గ్రామాల్లో సుమారు 350కిపైగా కటింగ్ అండ్ పాలిషింగ్ ప్యాక్టరీలు ఉన్నాయి. ఇన్నాళ్లుగా పోటాపోటీగానే ప్రొడక్షన్ తీసి విక్రయించే వారు. ఇక్కడ గ్రానైట్‌లో పరిశ్రమ వృద్ధిని పరిగణలోకి తీసుకొని.. గత దశాబ్ధ కాలంలో దాదాపు రెండు వందల వరకు కొత్తగా కంపెనీలు వచ్చాయి. అయినా మొత్తం కంపెనీలు తీసిన ప్రొడక్షన్ సేల్స్ చేసుకుంటూ వచ్చారు. ప్రతి ఏడాదిలో ఒకటి రెండు సార్లు స్లాగ్ సీజన్ వచ్చినా.. ఆ తదుపరి మళ్లీ మార్కెట్ పుంజుకోవడం.. తిరిగి ప్రొడక్షన్‌ను విక్రయించుకొని ప్యాక్టరీలను నడిపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ఒకవైపు కంపెనీలు పెరగడంతో..ప్రొడక్షన్‌పెరిగింది. బయట నిర్మాణ రంగం కుదేలు కావడం.. కటింగ్ గ్రానైట్ సేల్స్ దారుణంగా పడిపోయాయి. కొన్ని ప్యాక్టరీల్లో గడిచిన మూడు నాలుగు నెలలుగా ఒక్క ఫీట్ గ్రానైట్‌కూడ అమ్మలేదని పలువురు యజమానులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితినుంచి గట్టేక్కడానికి ఒకే ఒక మార్గం ప్రొడక్షన్‌తగ్గించుకోవాలని నిర్ణయించిన యూనియన్.. ఆవిషయాన్ని అందరూ ప్యాక్టరీ యజమానులతో చర్చించింది. ఆమేరకు.. ప్రతి ఆదివారం ప్రొడక్షన్ హాలీడే ప్రకటించాలని నిర్ణయం తీసుకుంది. ఈనిర్ణయాన్ని ఈ ఆదివారం నుంచే ప్రారంభించి అచరణలో పెట్టింది. దీంతో.. ఆదివారం అన్ని కటింగ్ ప్యాక్టరీలు గ్రానైట్ కటింగ్ నిలివేసాయి.

## నిర్మాణ రంగంపై పెను ప్రభావం

రాష్ట్రంలో నిర్మాణరంగం గత కొన్నాళ్లుగా కుదేలు అయింది. దీనికి అనేక కారణాలు దోహదం అవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలు. దేశీయంగా వచ్చిన మార్పులు.. ఇటీ వల ఏపీలో వచ్చిన తుఫాన్ వంటి కారణాల వల్ల తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణ రంగం ముందుకు వెళ్లడం లేదు. అంతేకాదు.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఏటా వందలాది ఇండ్లు నిర్మాణం అయ్యేవి. సంవత్సరానికి 100 నుంచి 120 వరకు అపార్ట్‌మెంట్లు నిర్మాణం అయ్యేవి. వీటితో పాటుగా.. ప్రభుత్వ పరంగా సుందరీకరణ పనులు జరిగేవి. వీటికి దాదాపు లోకల్‌గా ఉత్పత్తి అయ్యే గ్రానైట్ మాత్రమే వాడే వారు. దీనికి మరోకారణం ఉంది. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలతో పొల్చిచూస్తే.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తి అయ్యే టాన్‌బ్రౌన్ ధర తక్కువగా ఉంటుంది. దీంతో.. ఇన్నాళ్లు ఎక్కువగా ఇదే వాడే వారు. కానీ ప్రస్తుత దేశీయ మార్కెట్‌లో విట్రిఫైడ్ టైల్స్ వాడకం పెరిగింది. ఈ ప్రభావం కూడా గ్రానైట్‌పై పడుతోంది. ఇవేకాదు.. టైల్స్‌లో భిన్న ఆకట్టుకునే కలర్స్ వస్తున్నాయి.లేయింగ్ చేయడానికి కూలీ రేట్లు తక్కువ అవుతున్నాయి. నిజానికి గ్రానైట్‌తో పొల్చిచూసినప్పుడు... వివిధ రకాల టైల్స్ మన్నిక తక్కువే అయినా... వినియోగదారులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ఇది కూడా ఒక కారణమై అయినా.. ప్రధానంగా నిర్మాణ రంగం అలముకున్న చీకట్ల ప్రభావం గ్రానైట్‌తో సహా అన్నింటిని తాకుతున్నాయి. తాజా పరిస్థితులను పరిగణలోకి తీసుకొని.. తప్పని పరిస్థితుల్లోనే తాము ప్రొడక్షన్ హాల్‌డేను ప్రకటించాల్సి వచ్చిందని గ్రానైట్ కటింగ్ అండ్ ప్యాలిషింగ్ ప్యాక్టరీల జిల్లా అధ్యక్షుడు జువ్వాడి ప్రణీత్‌రావు తెలిపారు. పరిస్థితులు కుదటపడే వరకు.. ఈ ప్రొడక్షన్ హాలిడే వర్తింపచేస్తామని, ఇది అందరం కలిసి సమిష్టిగా తీసుకున్న నిర్ణయమని కోరారు. స్థానిక నిర్మాణ దారులు.. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న గ్రానైట్‌ను కొనుగోలు చేయాలని, తద్వారా.. పరిశ్రమలు తిరిగి పుంజుకోవడానికి అస్కారం ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేసారు.

# ఆగ్రహజ్వాల



దీక్షకు వస్తున్న మాజీ మంత్రికొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

- సింగరేణి సంస్థపై బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణుల కన్నెర్ర
- వాస్తవ లాభాల్లో వాటా కోసం పోరుబాట
- ఖని చౌరస్తాలో ఒకరోజు శాంతియుత దీక్ష
- దీక్ష భగ్నానికి పోలీసుల యత్నం.. టెంటు వేయకుండా అడ్డగింత
- శాంతియుతంగా చేపడుతున్నామని చెప్పినా ససేమిరా
- పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు
- తిరిగి టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద దీక్ష
- కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్



ఖనిలో చౌరస్తాలో దీక్షను భగ్నం చేస్తున్న పోలీసులు

గోదావరిఖని, అక్టోబర్ 6: సింగరేణి కార్మికులకు అండగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులు కదంతొక్కారు. సింగరేణి 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన రూ.4,701 కోట్ల వాస్తవ లాభాలపై 33 శాతం వాటాను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో ఒకరోజు శాంతియుత దీక్ష చేపట్టగా, పోలీసులు భగ్నం చేసేందుకు యత్నించారు. టెంటు వేయకుండా అడ్డుతగిలారు. శాంతియుతంగా చేపడుతున్నామని చెప్పినా వినకపోవడంతో పోలీసులు, శ్రేణులకు మధ్య కాసేపు తోపులాట జరిగింది. ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులతో మాజీ మంత్రి కొప్పుల, అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, రామగుండం, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్‌రావు, పుట్టమధూకర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి వాగ్వాదానికి దిగారు. శాంతియుత వాతావరణంలో దీక్ష చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదని, అతిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా టీబీజీకేఎస్, బీఆర్ఎస్ అక్కడే రోడ్డుపై బైఠాయించారు. నల్ల కండువాలు కప్పుకొని నిరసన తెలిపారు. కాగా, ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు దీక్ష జరుగకుండా పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేయగా, టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణులు వెనక్కి తగ్గలేదు. సమీపంలోని టీబీజీకేఎస్ కార్యాలయానికి చేరుకొని, ఆవరణలో టెంటు వేసి దీక్ష చేపట్టారు. సింగరేణి, ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

## నికర లాభాలపై వాటా ఇవ్వాల్సిందే

సింగరేణి లాభాల్లో వాటా పంపిణీలో యాజమాన్యం గోల్‌మాల్ చేస్తున్నదని, కార్మికుల శ్రమను దోచుకుంటున్నదని టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.4,701 కోట్ల నికర లాభాలు సాధించిందన్నారు. 33 శాతం వాటా అంటే కార్మికులకు రూ.1,550కోట్లు వస్తాయన్నారు. కార్మికులను మోసం చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, జనరల్ సెక్రటరీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, కేంద్ర ఉపాధ్యక్షుడు బడికల సంపత్, ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్, ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య, పెట్టెం లక్ష్మణ్, మేడిపల్లి సంపత్, మల్రాజు శ్రీనివాసరావు, బడితెల సమ్మయ్య, ఎల్ వెంకటేశ్, పొలాడి శ్రీనివాసరావు, సత్యం, శేషగిరి, బీఆర్ఎస్ నాయులు డాక్టర్ రాజా రమేశ్, నడిపెల్లి విజిత్‌రావు, రవి, కార్పొరేటర్లు గాదం విజయ, కృష్ణవేణి, విజయలక్ష్మీ, కవితా సరోజని, సంధ్యారెడ్డి ఉన్నారు.

## మరీ ఇంత దౌర్జన్యమా..?



సింగరేణి కార్మికులకు సంస్థ వాస్తవ లాభాలపై వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖనిలో శాతియుతంగా నిరసన దీక్ష చేపడితే పోలీసులతో భగ్నం చేయించడం సరికాదు. మరీ ఇంత దౌర్జన్యం పనికిరాదు. కాంగ్రెస్ అన్నివర్గాల ప్రజలను నయవంచన చేస్తోంది. సింగరేణి కార్మికులను ముంచుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు నికర లాభాలపై మాత్రమే లాభాల వాటాను పంచింది. వాటా శాతాన్ని ఒకటి రెండు శాతం పెంచుకుంటూ పోయింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 32శాతం వాటా చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న వాటా లెక్క తప్పుల తడకగా ఉంది. 33శాతం వాటా అని చెబుతున్నా వాస్తవానికి కార్మికులకు ఇస్తున్నది కేవలం 16.9శాతం మాత్రమే. కార్మికుల పొట్టకొట్టడం సరికాదు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

**- కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి**

## ఆందోళనలు చేస్తూనే ఉంటాం.



సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాల వాటా చెల్లించే వరకు పోరాటం ఆగదు. సంస్థ ప్రకటించిన నికర లాభం రూ.4,701 కోట్లపై కార్మికులకు 33శాతం వాటాగా రూ.1,551 కోట్లు చెల్లించాల్సిందే. సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఉన్న ఐఎన్టీయూసీలు అధికార కాంగ్రెస్‌కు తొత్తుగా మారిపోయాయి. కార్మికులకు న్యాయం చేయాల్సిన కార్మిక సంఘాలు పట్టించుకోకపోవడం సరికాదు. ఈ రోజు తాము గోదావరిఖనిలో శాంతియుత వాతావరణంలో నిరసన దీక్షకు పిలుపునిస్తే పోలీసులు వచ్చి అడ్డుకోవడం కాంగ్రెస్ నైజాన్ని తెలియజేస్తుంది.

**- మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు**

## అణిచివేస్తే ఆగేది లేదు



సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాలపై 33శాతం వాటాను చెల్లించాలని డిమాండ్ చేయడం తప్పా. శాంతియుతంగా ఒకరోజు నిరసన దీక్ష చేపడితే పోలీసులు అత్యుత్సాహం చూపి, అడ్డుకోవడం, టెంట్లు కూల్చివేయడం సరికాదు. అణిచివేయాలని చూస్తే ఆగేది కాదు. కార్మికులకు న్యాయం జరిగేదాకా కొట్లాడుతాం. సింగరేణి 2023–24 వార్షిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల నికర లాభాలు సాధించింది. దానిపై 33 శాతం అంటే రూ.1,551 కోట్లు కార్మికులకు వాటాగా ఇవ్వాలి. కానీ కేవలం 16.9 శాతం మాత్రమే ఇస్తూ కార్మికులను మోసం చేయాలని చూస్తే ఊరుకోం.

**- కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే**

# చివరి దశకు డిజిటల్ కార్డు సర్వే



- రేపు నోడల్ అధికారుల చేతికి వివరాలు
- ఉమ్మడి జిల్లాలో 5,359 కుటుంబాల్లో పైలెట్ సర్వే
- 9 నుంచి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు
- కార్డుల పంపిణీపై క్లారిటీ ఇవ్వని సర్కారు

చొప్పదండి పట్టణంలో డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్

కరీంనగర్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ సర్వే సోమవారంతో ముగియనున్నది. ప్రతి పథకానికి ఈ కార్డునే ప్రామాణికంగా తీసుకోనున్న నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో ఒక మున్సిపల్ వార్డు, ఒక చిన్న గ్రామాన్ని ఎంపిక చేసుకుని అధికారులు పైలెట్ సర్వే నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 ప్రదేశాలను ఎంపిక చేసిన అధికారులు ఈ నెల 4న సర్వే ప్రారంభించారు. ఈ నెల 8న నోడల్ అధికారులకు వివరాలు అందించనుండగా 9, 10 తేదీల్లో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయనున్నారు.

## ప్రతి పథకానికి ఇదే ప్రామాణికం

ఫ్యామిలీ డిజిటల్ కార్డులను ప్రతి కుటుంబానికి అందించే లక్ష్యంతో అధికారులు ఈ పైలెట్ సర్వే చేపట్టారు. కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి, చొప్పదండి, హుజూరాబాద్, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, మంథని, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డును ఎంపిక చేసుకున్నారు. అలాగే, ఆయా నియోజకవర్గాలోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసుకుని 5,359 కుటుంబాలను సర్వే చేస్తున్నారు. సర్వే చేసేందుకు 11 కాలమ్స్‌తో ఉన్న ఒక ఫార్మెట్‌ను రూపొందించుకున్నారు. పైలెట్ కోసం ఎంపిక చేసుకున్న ఇండ్లకు వెళ్లి మహిళలను ఇంటి యజమానులుగా గుర్తించి కుటుంబ సభ్యుల పేర్లను సేకరిస్తున్నారు. వారికి ఇది వరకు ఏమైనా హెల్త్ కార్డులు ఉన్నాయా?, ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధి వివరాలను సేకరిస్తున్నారు. ఇక నుంచి ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ కార్డులను ప్రామాణికంగా తీసుకోనున్న నేపథ్యంలో కుటుంబ సభ్యుల ఫొటోలు కూడా సేకరిస్తున్నారు. సర్వే ప్రక్రియను కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుండగా ప్రతి నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని, మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోల పర్యవేక్షిస్తున్నారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిగా ఆర్‌వీ కర్ణన్‌ను నియమించగా, ఆయన చొప్పదండిలో పరిశీలించారు. అయితే, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం పైలెట్ సర్వే నిర్వహించినప్పటికీ ఆయా కుటుంబాలకు కార్డులు పంపిణీ చేస్తారా, లేదంటే ఇపుడు జరిగిన సర్వేను అనుభవంలోకి తీసుకుని లోటు పాట్లను సరిచేసుకుని పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన తర్వాతనే ఒకేసారి కార్డులు జారీ చేస్తారా? అనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత కనిపించడం లేదు.